అకాల వర్షంతో అపార నష్టం


పాలకొండ రూరల్: రాజుపేట - తుమరాడ మధ్యలో ఆటోపై పడిపోయిన చెట్ల కొమ్మలు


- ఈదురు గాలుల బీభత్సం
- విరిగిన విద్యుత్ స్తంభాలు.. నేలకొరిగిన చెట్లు
- నిలిచిన విద్యుత్ సరఫరా
- తక్షణ చర్యలు చేపట్టిన విద్యుత్, పోలీస్ అధికారులు

పాలకొండ రూరల్: ఉదయం నుంచి ఎండ తీవ్రత.. వడగాలుల ప్రభావంతో ఉక్కబోతకు గురై ఇళ్లకే పరిమితమైన పట్టణ, మండల వాసులకు అకాల వర్షం ఆపార నష్టాన్ని మిగిల్చింది. సోమవారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఉన్నట్లుండి వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. నల్లని మబ్బులు దట్టంగా కమ్ముకోవడంతో భారీ వర్షం కురుస్తుందని అంతా భావించారు. ఇంతలో ఉరుములు, మెరుపులకు ఈదురు గాలులు తోడయ్యాయి. ఒక్కసారిగా దుమ్ము రేగడంతో పాటు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు.. ఇదే సమయంలో వర్షం ప్రారంభమైంది. దీంతో పాలకొండ – వీరఘట్టం రహదారిలో భారీగా చెట్లు రహదారికిరువైపులా నేలకొరిగాయి. వాటపాగు గ్రామానికి చెందిన అప్పలనాయుడు ఆటోపై చెట్టు పడిపోయింది. ఈ సంఘటనలలో వాహన చోదకుడితో పాటు అందులో ప్రయాణిస్తున్న ముగ్గురు పెద్ద ప్రమాదం నుంచి స్వల్ప గాయాలతో బయట పడ్డారు. మండలంలోని బుక్కూరు గ్రామానికి వెళ్లే మార్గంలో చెట్లు పడిపోడంతో బాహ్య ప్రపంచానికి రాకపోకలు నిలిచాయి. అక్కడి యువత ఈ చెట్లను తొలగించే పనిలో పడ్డారు. భాసూరు, స్థానిక కస్పా వీధిలో విద్యుత్ స్తంభాలు ఇళ్లపై నేలకొరిగాయి. లుంబూరు, ఓని రహదారుల్లో చెట్ల కొమ్మలు విరిగి పడడంతో పాదచారులు ఇబ్బంది పడ్డారు. మరోవైపు ఆర్టీసీ కాంప్లెక్స్‌లోకి చేరిన పాదచారులు, ప్రయాణికుల వర్షం తగ్గేవరకూ బిక్కుబిక్కుంటూ గడిపారు. గాలుల ధాటికి పట్టణంలోని హోర్డింగ్‌లు, ఫెక్సీలతో పాటు పలు ప్రాంతల్లో పశువుల షెడ్లు, రేకుల షెడ్ల పైకప్పులు ఎగిరిపడ్డాయి. ఈ సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో మండల వ్యాప్తంగా అంధకారం నెలకొంది. విద్యుత్, పోలీస్ అధికారులు స్పందించి సహాయక చర్యలు చేపట్టారు.

ఈదురు గాలులు..

భామిని: మండలంలో సోమవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో మామిడి, జీడి చెట్ల కొమ్మలతో పాటు కాయలు నేలరాలాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు.


పాలకొండ రూరల్: భాసూరు గ్రామంలో ఇంటిపై విరిగిపడ్డ విద్యుత్ స్తంభం


భామిని : ఈదురుగాలులతో ఊగుతున్న చెట్లు

నిండాముంగిన రైతు..

ఈదురు గాలులతో కూడిన ఆలకాల వర్షం రైతులను నిండా ముంచింది. ముఖ్యంగా పాలకొండ, బుక్కూరు, రుద్రిపేట, అట్టలి, వెలగవాడ, తదితర ప్రాంతాలలో పెద్ద సంఖ్యలో జీడి, మామిడి తోటలు నాశనమయ్యాయి. కాయలు నేల రాలడంతో యజమానులు, కౌలు రైతులు కన్నీటిపర్యంతమయ్యారు. అలాగే బొప్పాయి, అరటి, మునగ, తదితర చెట్లు నేలకొరిగాయి. తుమరాడ, గరుగుబిల్లి గ్రామాల్లో చిక్కుడు, బీర, ఆనప, దొండ, తదితర తీగజాతి కూరగాయలతో పాటు పూల తోటలకు కూడా నష్టం వాటిల్లింది.


పాలకొండ రూరల్:పాలకొండ - వీరఘట్టం రహదారిలో నేలకొరిగిన చెట్లు


పాలకొండ రూరల్: రుద్రిపేట గ్రామంలో నేలరాలిన మామిడి కాయలు

క్లుప్తంగా

సీతంపేటలో భారీ వర్షం


సీతంపేటలో కురుస్తున్న వర్షం

సీతంపేట: మండల కేంద్రంలో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. మూడు రోజులుగా అధిక ఎండలతో అల్లాడుతున్న ప్రజానీకానికి వర్షం ఊరటనిచ్చింది. ఈదురు గాలులు, ఉరుములతో కూడిన వర్షం గంట పాటు పడింది. దీంతో అరటి, జీడి, మామిడి పంటలకు నష్టం వాటిల్లిందని రైతులు తెలిపారు.

సారా తయారీ స్థావరాలపై దాడులు


సారా తయారీ సామగ్రితో ఎక్సైజ్ సిబ్బంది

పాలకొండ: రాష్ట్ర సరిహద్దు గ్రామాల్లో ఒడిశా ఎక్సైజ్ సిబ్బందితో కలిసి ఉమ్మడి దాడులు నిర్వహించామని ఎక్సైజ్ సీఐ సూర్యకుమారి తెలిపారు. సోమవారం సాయంత్రం స్థానిక ఎక్సైజ్ కార్యాలయం వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆ వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భామిని మండలం సరిహద్దులో గల రాయగడ జిల్లా పరిధిలో సారా తయారు చేస్తున్నట్లు గుర్తించి ఒడిశా అధికారులకు సమచారం అందించామన్నారు. వారి సహకారంతో దాడులు చేపట్టి 23 వేల లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేశామని తెలిపారు. మొదటి సారిగా ఇరు రాష్ట్రాలకు చెందిన సిబ్బంది దాడుల్లో పాల్గొన్నారని వివరించారు.

ఖరీఫ్ సీజన్‌కు రైతుల సమాయత్తం


మాట్లాడుతున్న ఏఓ ఎస్.అవినాష్

సీతానగరం: మండలంలో ఖరీఫ్ 2025 సీజన్ పంట కాలానికి సంబంధించి వ్యవసాయ శాఖ సిద్ధంగా ఉందని వ్యవసాయ అధికారి ఎస్.అవినాష్ వారు తెలిపారు. ఈ మేరకు అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో భాగంగా సోమవారం నిడగల్లులో ఖరీఫ్ సీజన్‌లో అవలంబించాల్సిన విధానాలపై అవగాహనసదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ పంట కాలానికి సంబంధించి రైతులు పచ్చిరొట్ట పంటలు వేసుకోవాలని తెలియచేశారు.వాటిని భూమిలో కలియదున్నడం వల్ల నేలకు పోషకాలు అందుతాయి, సేంద్రియ పదార్థం పెరుగుతుంది, నేల నిర్మాణం మెరుగుపడుతుందని వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ భవన నిర్మాణానికి శంకుస్థాపన

సాలూరు రూరల్: మండలంలోని మామిడిపల్లి గ్రామంలో గిరిజన శాఖామంత్రి గుమ్మిడి సంధ్యారాణి రూ.21 లక్షలతో నిర్మించనున్న పీఏసీఎస్ భవన నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి శ్రీరామమూర్తి, గ్రామ సర్పంచ్ సువ్వాడ శశికళ, వైస్ ఎంపీపీ సువ్వాడ గుణావతి తదితరులు పాల్గొన్నారు.

కామాక్షమ్మకు వెండి చీరతో అలంకరణ


వెండి చీర అలంకరణలో దర్శనమిస్తున్న కామాక్షమ్మ

సాలూరు: పట్టణంలోని కామాక్షమ్మ తల్లి వెండి చీర అలంకరణలో భక్తులకు సోమవారం దర్శనమిచ్చారు. కామాక్షి అమ్మవారి ఆలయ దశమ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండవ రోజైన సోమవారం అమ్మవారిని వెండిచీరతో ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసారు.

సాగునీటి కాలువలు బాగుచేయండి


కొంకదివరం వద్ద కాలువ పరిశీలనలో ఏపీ రైతు సంఘం ప్రతినిధి అప్పలనాయుడు, తదితరులు

గరుగుబిల్లి: జంఘావతి కాలువల్లో పేరుకుపోయిన పూడికలు, పిచ్చిమొక్కలు తొలగించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు డిమాండ్ చేశారు. మండలంలోని కొంకడివరం గ్రామం వద్ద కాలువను రైతులతో కలిసి సోమవారం పరిశీలించిన ఆయన.. డొంకలు, తుప్పలు, పూడికలతో కాలువ నిండి ఉండడం వల్ల పొలాలకు సక్రమంగా సాగునీరు అందడం లేదన్నారు. కేవలం వర్షాలపై ఆధారపడి వ్యవసాయం చేయాల్సిన దుస్థితి నెలకొందన్నారు. పార్వతీపురం సమీపంలోని కాలువల్లో పూర్తిగా గుర్రపుడెక్క ఉందని, సాగునీరు ముందుకు వెళ్లక కాలువకు గండ్లు పడే పరిస్థితి ఉందన్నారు. జిల్లాలోని తోటపల్లి పాత కాలువ ఆధునీకరణ గానీ, రావాడ, పెదంకలాం, వెంగళరాయ ప్రాజెక్టుల కాలువల ఆధునీకరణకు గానీ ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో పలుచోట్ల కాలువలు శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. రానున్న ఖరీఫ్ నాటికి అయినా సాగునీరు సక్రమంగా అందేలా కాలువలు బాగు చేయాలని ఆయన కోరారు. ఆయన వెంట సర్పంచ్ అల్లు అప్పలనాయుడు, రైతులు వి.జనార్ధనాయుడు, ఎ.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహభావం..


విజేతలకు బహుమతి అందిస్తున్న సొసైటీ చైర్మన్ రమేష్, ట్రైనీ ఎస్సై శివనాగిరెడ్డి

భామిని: క్రీడల వల్ల యువతలో స్నేహభావం పెంపొందాలని పీఏసీఎస్ మాజీ చైర్మన్ గెల్లంకి రమేష్, బత్తిలి ట్రైనీ ఎస్సై శివనాగిరెడ్డి, ఏఎస్సై కొండగొర్రి కాంతారావు అన్నారు. మండలంలోని లివిరి కూడలిలో గజపతినగరానికి చెందిన కద్రక గణేష్, ఎ.ఢిల్లీ ఆధ్వర్యంలో జరిగిన క్రికెట్ టోర్నమెంట్ ముగింపు పోటీల్లో పాల్గొని మాట్లాడుతూ.. పన్నెండు రోజులుగా టోర్నమెంట్ నిర్వహిస్తున్నారని, ఇందులో 24 టీమ్‌లు పాల్గొన్నాయని తెలిపారు. ఫైనల్ పోటీల్లో బత్తిలికి చెందిన యువరాజ్ టీమ్ విజేతగా.. బాలేరు జట్టు రన్నర్‌గా నిలిచిందని చెప్పారు. విజేతలకు నగదు బహుమతి, ట్రోఫీలు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో బత్తిలికి చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు రవిసాహూ, యూత్ లీడర్లు పాల్గొన్నారు.

పోరాటమే మార్గం..


సమ్మె కరపత్రాలు విడుదల చేస్తున్న ఆటో యూనియన్, సీఐటీయూ నాయకులు

పాలకొండ రూరల్: కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు పోరాటం ఒక్కటే సరైన మార్గమని సీఐటీయూ మండల నాయకుడు కాద రాము అన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్పొరేట్ పోకడలపై గళమెత్తేందుకు ఈ నెల 20న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవతం చేయాలని పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను సోమవారం స్థానిక ఆటోస్టాండ్ వద్ద పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రవాణ రంగాపై బీజేపీ తీసుకువచ్చిన నూతన చట్టాలు ఆటో డ్రైవర్లను అవస్థల పాల్జేస్తున్నాయని ఆరోపించారు. లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని కోరారు.

సకాలంలో పూర్తి చేయాలి


వేతనదారులకు సూచనలు చేస్తున్న ఎంపీడీఓ రంగారావు

పాలకొండ రూరల్: ఉపాధి వేతనదారులు చేపడుతున్న సాగునీటి కాలువలు, చానల్ పనులు సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీఓ ఎం.విజయరంగారావు అన్నారు. మండలంలోని అన్నవరం గ్రామ సచివాలయ పరిధిలో వేతనదారులు చేపడుతున్న బట్టి పనులను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలువలను సకాలంలో అందుబాటులోకి తీసుకువస్తే ఖరీఫ్ సీజన్‌లో రైతులకు మేలు జరుగుతుందని చెప్పారు. మస్తర్లు, రికార్డులు సక్రమంగా నిర్వహించాలని ఉపాధి ఏపీఓ ఈశ్వరమ్మకు సూచించారు.

క్రీడలతో గుర్తింపు


ఖోఖో క్రీడలో నిమగ్నమైన విద్యార్థులు

పాలకొండ రూరల్: చదువుతో పాటు క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిస్తే ప్రత్యేక గుర్తింపు పొందవచ్చని శాఖా గ్రంథాలయ అధికారి బబ్బూరి గణేష్‌బాబు అన్నారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా సోమవారం పిల్లలకు ఖోఖో, కబడ్డీ క్రీడల్లో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. అనంతరం గణితంలో మెలకువలను విశ్రాంత ఉపాధ్యాయులు వివరించారు.

వేపారమ్మ ఉత్సవాలు ప్రారంభం


పూజలందుకుంటున్న వేపారమ్మ

గుమ్మలక్ష్మీపురం: భక్తుల పాలిట కల్పవల్లిగా పేరొందిన వేపారమ్మ ఉత్సవాలు మండల కేంద్రంలో సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావు ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీ పర్యవేక్షణలో తొమ్మిది రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల నిర్వహణలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. ఏడేళ్ల తర్వాత ఈ పండగ జరుగుతుండడంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. బంధుమిత్రులతో ప్రతి ఇల్లు కళకళలాడుతోంది.

14 నుంచి కెరీర్ గైడెన్స్‌పై శిక్షణ

గరుగుబిల్లి: మండల పరిధిలోని తోటపల్లిలో ఉన్న జట్టు ట్రస్టు కార్యాలయంలో ఈ నెల 14వ తేదీ నుంచి 16వ తేదీ వరకు కెరీర్ గైడెన్స్‌పై శిక్షణ ఇవ్వనున్నట్లు జట్టు ట్రస్టీ డి.పారినాయుడు ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. శ్రీరామచంద్ర మిషన్ ఆధ్వర్యంలో విశ్రాంత ఐఏఎస్ అధికారి జె.మురళి పర్యవేక్షణలో మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో నిరుద్యోగ యువతకు పోటీ పరీక్షల్లో ఎలా విజయం సాధించాలి, ధ్యానం, జ్ఞాపకశక్తి, బృంద కార్యక్రమాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. శిక్షణ కాలంలో శిక్షణార్థులకు ఉచిత భోజన, వసతి సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లు 9177114333, 8179012050లను సంప్రదించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి గాయాలు

భామిని: మండలంలోని బాలేరు కూడలిలో బైక్ ఢీకొనడంతో సొలికిరికి చెందిన బోణంగి సంజీవ్ అనే వృద్ధుడు గాయపడ్డాడు. కొత్తూరు వైపు నుంచి వేగంగా వస్తున్న ద్విచక్ర వాహనదారుడు నల్లరాయిగూడ వైపు నుంచి బాలేరుకు వస్తున్న బోణంగి సంజీవ్‌ను ఢీ కొన్నాడు. సోమవారం జరిగిన ఈ ప్రమాదంలో వృద్ధుడితో పాటు ఇద్దరు యువకులకు కూడా స్వల్ప గాయలయ్యాయి. వెంటనే స్థానికులు స్పందించి వృద్ధుడిని కొత్తూరు ఆస్పత్రికి తరలించారు.

పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతి కల్పించాలి

మక్కువ: రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీల పునర్వ్యవస్థీకరణ చేయనున్న నేపథ్యంలో పంచా యతీ కార్యదర్శులకు పదోన్నతి కల్పించాలని కోరు తూ మక్కువ మండలం పంచాయతీ కార్యదర్శులు సోమవారం డిప్యూటీ ఎంపీడీవో పి.దేవకుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పంచా యతీ కార్యదర్శులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పంచాయతీ కార్యదర్శులు పదోన్నతిపై ఆశగా ఎదురు చూస్తున్నారన్నారు.

ఉపాధి పనులు కల్పించాలి


ఎంపీడీవో హామీ ఇవ్వడంతో నిరసన వీడి, ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు.

వేతనదారులకు ఉపాధి హామీ పథకం పనులు కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో వేతనదారులతో కలిసి జియ్యమ్మవలస ఎంపీడీవో కార్యాలయం వద్ద సోమవారం బైఠాయించి, నిరసన చేపట్టారు. జియ్యమ్మవలసలోని వేతనదారులకు రెండు వారాలుగా పనులు కల్పించకపోవడాన్ని ఆయన ప్రశ్నించారు. వేతనదారులందరికీ పని కల్పిస్తూ వారు కోరిన చోట పనులు కల్పించాలని, 14 రోజుల్లోగా బిల్లులు చెల్లించాలని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చెప్పినా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. పనులు అడిగితే ఫారంపాండ్‌ల పనులు చేయాలని చెబుతున్నారని, ఏ రైతు ఫారంపాండ్‌ల పనికి ముందుకురావడం లేదని తెలిపారు. వీరి నిరసన గూర్చి ఎంపీడీవో ధర్మారావు ఎస్ఐకు సమాదారం ఇవ్వగా, సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్ఐ ఇరువర్గాలను సముదాయించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో వచ్చే వారం నుంచి పనులు కల్పిస్తామని ఎంపీడీవో హామీ ఇవ్వడంతో నిరసన వీడి, ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు.

–జియ్యమ్మవలస

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన ..



ఐటీడీఏ ప్రాంగణంలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను సోమవారం ప్రదర్శించారు. బెండ, వంకాయ, టమాట, పచ్చిమిర్చి, అరటి వంటి కూరగాయాలు.. కొర్రలు, సామలు, రాగులు వంటి చిరుధాన్యాల ఉత్పత్తులు విక్రయించారు. ప్రకృతి వ్యవసాయ రైతు శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

– సీతంపేట

రహదారి మరమ్మతులు చేపట్టాలని వినతి


తహసీల్దారు సాయికామేశ్వరరావుకు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నేత సాంబమూర్తి

కొమరాడ: పార్వతీపురం-కూనేరు అంతర్‌రాష్ట్ర రహదారి మరమ్మతులు పూర్తి స్థాయిలో చేపట్టాలని సీపీఎం నాయకుడు కొల్లు సాంబమూర్తి డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయానికి సోమవారం వెళ్లి, తహసీల్దారు సాయి కామేశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు. రోడ్డు అంతా గోతులమయం కావడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇదే రహదారి మీదుగా మూడు పరిశ్రమలకు అవసరమైన ముడి సరుకు తీసుకువెళ్లే భారీ వాహనాలు తిరుగుతాయని, ఇంతటి ప్రాధాన్యం కలిగిన రోడ్డును బాగుచేయడానికి చొరవ చూపాలన్నారు.

దోమల నివారణ మందు పిచికారీ


ఏసీఎం మందు పిచికారీని పర్యవేక్షిస్తున్న ఎంపీడీఓ, తదితరులు

సీతంపేట: మండల కేంద్రంలోని ఒకటో గ్రామ సచివాలయం పరిధిలో మలేరియా నివారణ శాఖ ఆధ్వర్యంలో దోమల నివారణ మందు సోమవారం పిచికారీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ బీబీ విశ్రో మాట్లాడుతూ.. ప్రతి ఇంటిలో ఏసీఎం ఐదు శాతం ద్రావణం పిచికారీ చేయించుకోవాలని సూచించారు. మొదటిరౌండ్‌లో వి.పెద్దగూడ, నాయుడుగూడ, లక్కాయిగూడ, దీసరిగూడలలో పిచికారీ చేయనున్నట్లు సబ్‌యూనిట్ అధికారి జె.మోహనరావు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆరిక కళావతి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

గాలికొదిలేసిన నీటితొట్టెల నిర్వహణ


గెద్దతిరువాడలో వినియోగంలో ఉన్న నీటితొట్టె


మరోచోట నీరు లేని తొట్టె

జియ్యమ్మవలస మండలంలో నీటి తొట్టెల నిర్వహణను గాలికొదిలేశారు. వేసవిలో పశువుల దాహార్తి తీర్చడమే లక్ష్యంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో మండలంలో మొత్తం 56 నీటి తొట్టెల నిర్మాణం చేపట్టారు. అయితే ప్రస్తుతం వాటిల్లో నీరు నింపే నాథుడు కరువయ్యాడు. చాలా వాటిల్లో నీరు లేకపోవడం చూసి ఇలా ఉంటే పశువుల దాహం ఎలా తీరుతుంది.. ఇదేనా నిర్వహణ అని పలువురు విమర్శిస్తున్నారు. ఒక్కో తొట్టె నిర్మాణానికి రూ.20 వేలు నుంచి రూ.30 వేలు ఖర్చు కాగా ఇంత డబ్బులు పెట్టిన వీటిని ఇలా నిర్లక్ష్యం చేయడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా సక్రమంగా నిర్వహించి, నీటితొట్టెల నిర్మాణ లక్ష్యం నెరవేరేలా చూడాలని పాడిరైతులు కోరుతున్నారు.

–జియ్యమ్మవలసరూరల్